మన జానజ్యోతి

తెలుగు డిజిటల్ దినపత్రిక

భావి తరాల మార్గదర్శి

15-11-2026

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలకు స్కౌటింగ్ వేదిక



మదనపల్లె, జ్ఞానజ్యోతి: విద్యార్థులను క్రమశిక్షణ కలిగిన, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తోందని సమగ్ర శిక్ష అన్నమయ్య జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) డాక్టర్ అనురాధ పేర్కొన్నారు.స్కౌటింగ్ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చక్కటి వేదికగా నిలుస్తుందని తెలిపారు. మదనపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్కౌట్ మాస్టర్లకు నిర్వహిస్తున్న బేసిక్, అడ్వాన్స్‌డ్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. శిక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స, వివిధ రకాల బ్యాండేజీలు కట్టడం, తాళ్లతో ముడులు వేయడం, పయోనీరింగ్ నిర్మాణాల వంటి ప్రాయోగిక కార్యక్రమాలను పరిశీలించారు.



మిథున్ రెడ్డికి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత ఉందా?

మూడుసార్లు ఎంపీగా గెలిచి రాజంపేటకు చేసిందేమిటి?

వైసీపీ హయాంలో ప్రతిపక్షాల నామినేషన్లకే అడ్డంకులు సృష్టించారు

గతంలో జరిగిన దాడులు, దౌర్జన్యాలు ప్రజలు మరిచిపోలేదు

టీడీపీ సీనియర్ నేత ఆర్.జె. వెంకటేష్ తీవ్ర విమర్శలు

మదనపల్లె, జ్ఞానజ్యోతి: ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్.జె. వెంకటేష్ విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాల గొంతు నొక్కి, నామినేషన్లు వేయకుండా అడ్డుకున్న చరిత్రను మరిచిపోయారా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి పట్ల తెలుగుదేశం పార్టీకి అపారమైన గౌరవం ఉందని, అందుకు నిదర్శనంగానే కూటమి ప్రభుత్వ హయాంలో ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించామని పేర్కొన్నారు. శుక్రవారం నిమ్మనపల్లె కూడలిలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లె మండల ఎంపీపీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఎంపీ మిథున్ రెడ్డి టీడీపీ కార్యకర్తలపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శలు చేసే ముందు గతంలో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన పరిణామాలను గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. టీడీపీ కార్యకర్తలకు ట్రీట్‌మెంట్ ఇస్తామంటూ హెచ్చరికలు చేయడం ఎంపీ స్థాయికి తగదన్నారు.

నామినేషన్లు అడ్డుకున్న చరిత్ర మీది కాదా?...

గతంలో పెద్దిరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో జరిగిన రాజకీయ పరిణామాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని వెంకటేష్ ఆరోపించారు. ఎంపీ చిన్నాన్న పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి జిల్లా పరిషత్‌లో టెండర్ బాక్సులు ఎత్తుకెళ్లిన ఘటనను గుర్తుచేశారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో పుంగనూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ప్రతిపక్ష అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, ఏకగ్రీవాల పేరుతో ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీశారని విమర్శించారు. అలాంటి నేపథ్యం ఉన్న నాయకులు ఇప్పుడు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు.

ప్రజలు ఇప్పటికే బుద్ధి చెప్పారు....

టీడీపీ కార్యకర్తలకు ట్రీట్‌మెంట్ ఇస్తామని మిథున్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ, వాస్తవానికి వైసీపీ నాయకులే తమ రాజకీయ వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలో పుంగనూరులోనే ఎంపీకి ప్రజలు తగిన సమాధానం చెప్పారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం తలచుకుంటే వైసీపీ అభ్యర్థులకు రాజకీయంగా అవకాశమే లేకుండా చేయగలిగేదని, కానీ అలాంటి విధానం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీడీపీ సిద్ధాంతాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. గతంలో అంజిరెడ్డిపై, శ్రీకాకుళం నుంచి సైకిల్ యాత్రగా వచ్చిన టీడీపీ కార్యకర్తలపై జరిగిన దాడులను ప్రజలు ఇంకా గుర్తుంచుకున్నారని ఆరోపించారు.

మూడుసార్లు ఎంపీగా ఉండి సాధించిందేమిటి?...

మూడుసార్లు ఎంపీగా గెలిపించిన రాజంపేట పార్లమెంటు ప్రజలకు మిథున్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని వెంకటేష్ నిలదీశారు. కడపమదనపల్లెబెంగళూరు రైల్వే లైన్ పనుల పురోగతి విషయంలోనూ ఆశించిన ఫలితాలు లేవని విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు జి. ఆనంద్, రామచంద్ర నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, గండికోట గణేష్ బాబు, విద్యాసాగర్, రెడ్డెప్ప, వైద్యం కృష్ణయ్య, నారాయణ, నరసింహులు, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

సుగవాసి ప్రసాద్ బాబు అనే నేను

- అన్నమయ్య తొలి జడ్పీ చైర్మన్‌గా ఏకగ్రీవ ఎన్నిక
- జిల్లా పరిషత్ చరిత్రలో సరికొత్త అధ్యాయం
- 25 మంది జడ్పీటీసీలకు గాను సమావేశానికి హాజరైన 19 మంది సభ్యులు
- వైస్ చైర్మన్‌గా తలారి శరణ్య ప్రమాణ స్వీకారం
- ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానన్న నూతన చైర్మన్
- శుభాకాంక్షలు తెలిపిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి,
- ఎమ్మెల్యేలు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, షాజహాన్ బాషా













మదనపల్లె, జ్ఞానజ్యోతి: అన్నమయ్య జిల్లా పరిషత్‌కు తొలి సారథి వచ్చారు. జిల్లా ఆవిర్భావం తర్వాత తొలిసారిగా జిల్లా పరిషత్ పాలకవర్గం కొలువుదీరడంతో స్థానిక సంస్థల చరిత్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. గాలివీడు జడ్పీటీసీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు జిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా, పెద్దతిప్పసముద్రం జడ్పీటీసీ సభ్యురాలు తలారి శరణ్య వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.దీంతో అన్నమయ్య జిల్లా పరిషత్‌కు తొలి పాలకవర్గం ఏర్పాటైనట్లయింది. మదనపల్లె పట్టణంలోని బెంగళూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం ఈ చారిత్రక ఘట్టానికి వేదికైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి జిల్లా కలెక్టర్, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి నిశాంత్ కుమార్ అధ్యక్షత వహించారు.నూతనంగా ఎన్నికైన 25 మంది జడ్పీటీసీ సభ్యుల్లో 19 మంది సమావేశానికి హాజరయ్యారు. తొలుత సభ్యులతో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం జడ్పీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. గాలివీడు జడ్పీటీసీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు పేరును పుంగనూరు,కురబలకోట జడ్పీటీసీ సభ్యులు తోమరం నరసింహులు,పిల్లంగారి సురేంద్ర యాదవ్ ప్రతిపాదించారు. సమావేశానికి హాజరైన సభ్యులంతా ఆ ప్రతిపాదనకు మద్దతు తెలపడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. అదేవిధంగా వైస్ చైర్మన్ పదవికి పెద్దతిప్పసముద్రం జడ్పీటీసీ సభ్యురాలు తలారి శరణ్య పేరును కేవీపల్లి, కలకడ జడ్పీటీసీ సభ్యులు పి.రెడ్డి మహేంద్ర, ఎర్రయ్యగారి వెంకటరమణ ప్రతిపాదించారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించడంతో ఆమె కూడా వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్లతో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించి, ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. దీంతో జిల్లా పరిషత్ తొలి పాలకవర్గం అధికారికంగా బాధ్యతలు చేపట్టినట్లయింది.


పదవి కాదు.. ప్రజాసేవకు లభించిన అవకాశం..


జిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా ఎన్నికైన సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ప్రతిష్టాత్మక బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు కూటమి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ పదవిని వ్యక్తిగత గౌరవంగా కాకుండా ప్రజలకు సేవ చేసేందుకు లభించిన గొప్ప అవకాశంగా భావిస్తున్నానన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల సంక్షేమం, విద్య, వైద్యం, తాగునీరు వంటి ప్రాధాన్య అంశాలపై దృష్టిసారిస్తానని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ సమగ్ర అభివృద్ధి సాధించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. తనతో పాటు ఎన్నికైన వైస్ చైర్మన్, జడ్పీటీసీ సభ్యుల సహకారంతో సమష్టిగా ముందుకు సాగుతానన్నారు.

సమష్టి కృషితో జిల్లా అభివృద్ధి...

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నూతన చైర్మన్, వైస్ చైర్మన్లకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ప్రజలు, స్థానిక సంస్థలు ఆశించిన అభివృద్ధి ఫలాలు అందేలా నూతన పాలకవర్గం బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా అభివృద్ధికి చైర్మన్, వైస్ చైర్మన్, జడ్పీటీసీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ మధుసూదన్ నాయుడు, జడ్పీ సీఈవో లక్ష్మీపతి, జడ్పీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల నడుమ పునీత్ కుమార్ జన్మదినం





మదనపల్లె, జ్ఞానజ్యోతి: పుట్టినరోజు వేడుకలను ఆర్భాటాలకు దూరంగా నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చారు బహుజన యువసేన (బీవైఎస్) అధ్యక్షుడు పునీత్ కుమార్. తన జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలు,నిస్సహాయులకు అండగా నిలుస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం నిర్వహించిన వేడుకలు సేవా కార్యక్రమాల నడుమ ఘనంగా జరిగాయి. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సమాజ పరిశుభ్రత కోసం నిత్యం శ్రమించే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక గౌరవం కల్పిస్తూ వారితో కలిసి కేక్ కట్ చేశారు. కార్మికుల చేతుల మీదుగా కేక్ కట్ చేయించి తన జన్మదిన వేడుకలను జరుపుకోవడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.రోడ్డు ప్రమాదాల నివారణ,ప్రాణరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను అందజేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, నిరుపేదలు, నిస్సహాయులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే మున్సిపల్ కార్మికుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు.అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో పేదలకు, నిరుపేదలకు తన వంతు సహాయం అందించడమే జన్మదిన వేడుకలకు నిజమైన సార్థకత అని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి తమ ప్రాణాలను, కుటుంబాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పునీత్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఏఐ రంగంలో ఉద్యోగాల జాతర!

భవిష్యత్తంతా కృత్రిమ మేధస్సుదే..
విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి
మిట్స్ వర్సిటీలో మోడల్ కాంటెక్స్ట్ ప్రోటోకాల్‌పై అవగాహన వర్క్‌షాప్
ఏఐతో అనుసంధానమవుతున్న సాఫ్ట్‌వేర్, డేటాబేస్‌లు, అంతర్జాల సేవలు
ఏఐ అప్లికేషన్లు, క్లౌడ్ కంప్యూటింగ్‌లో విస్తృత అవకాశాలు
విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన క్వాంటిపై టెక్ లీడ్ ఎం. పవన్ కుమార్







మదనపల్లె, జ్ఞానజ్యోతి: మారుతున్న సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) కీలక శక్తిగా ఎదుగుతోందని, ఈ రంగంలో నైపుణ్యాలు సాధించిన యువతకు అపారమైన ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని బెంగళూరులోని క్వాంటిపై సంస్థ సీనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్, టెక్ లీడ్ ఎం. పవన్ కుమార్ తెలిపారు. విద్యార్థులు సంప్రదాయ ప్రోగ్రామింగ్ పరిజ్ఞానానికే పరిమితం కాకుండా ఆధునిక ఏఐ సాంకేతికతలపై పట్టు సాధించాలని సూచించారు. మదనపల్లె సమీపంలోని మిట్స్ (మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) డీమ్డ్ టు బి యూనివర్సిటీలో శుక్రవారం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, మిట్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ), ఐఎస్‌టీఈ సంయుక్త ఆధ్వర్యంలో ‘ఎక్స్‌ప్లోరింగ్ మోడల్ కాంటెక్స్ట్ ప్రోటోకాల్ (ఎంసీపీ): కనెక్టింగ్ ఏఐ విత్ ది రియల్ వరల్డ్’ అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పవన్ కుమార్ ఆధునిక ఏఐ సాంకేతికతలు, వాటి వినియోగం, భవిష్యత్తు అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐ వ్యవస్థలను వివిధ సమాచార వనరులు, సాఫ్ట్‌వేర్ సాధనాలు, డేటాబేస్‌లతో అనుసంధానించడంలో మోడల్ కాంటెక్స్ట్ ప్రోటోకాల్ (ఎంసీపీ) కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దీని ద్వారా ఏఐ అప్లికేషన్లు కేవలం సమాచారాన్ని అందించడమే కాకుండా, అవసరమైన సమాచారాన్ని సేకరించి వివిధ పనులను సమర్థంగా నిర్వహించగలుగుతాయని వివరించారు. పైథాన్, జావాస్క్రిప్ట్ ప్రోగ్రామింగ్ భాషలతో ఎంసీపీ సర్వర్ల రూపకల్పన, ఫైళ్లు, డేటాబేస్‌లు, వెబ్ సేవలను ఏఐ అప్లికేషన్లకు అనుసంధానించే విధానాలను ప్రాక్టికల్ ఉదాహరణలతో వివరించారు. తక్షణ స్పందనతో పనిచేసే ఏఐ అప్లికేషన్ల అభివృద్ధిలో ఎంసీపీ వినియోగం, దాని ప్రయోజనాలను తెలియజేశారు. అదే సమయంలో ఏఐ వ్యవస్థల్లో సమాచార భద్రత, వినియోగదారుల గుర్తింపు నిర్ధారణ, సమాచారాన్ని ఉపయోగించేందుకు అవసరమైన అనుమతుల ప్రాధాన్యాన్ని వివరించారు.

నైపుణ్యాలే ఉద్యోగాలకు బాటలు...

ప్రస్తుతం ఏఐ సాంకేతికత ఐటీ రంగానికే పరిమితం కాకుండా అనేక పరిశ్రమలు, సేవారంగాల్లోకి విస్తరిస్తోందని పవన్ కుమార్ పేర్కొన్నారు. ఏఐ అప్లికేషన్ల అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ ఆటోమేషన్, డేటా ఇంటిగ్రేషన్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి విభాగాల్లో భవిష్యత్తులో నిపుణులకు గణనీయమైన డిమాండ్ ఉంటుందన్నారు. విద్యార్థులు తరగతి గది పాఠ్యాంశాలతో పాటు ప్రాజెక్టులు, ప్రయోగాత్మక శిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామనాథన్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీదేవి, కో ఆర్డినేటర్లు కె. సతీష్, డాక్టర్ బి. ప్రశాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23న పుంగనూరులో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో
మెగా రక్తదాన శిబిరం

విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలి
ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మున్నా



పుంగనూరు, జ్ఞానజ్యోతి: అత్యవసర సమయాల్లో రక్తం అందక ఏ ఒక్కరి ప్రాణం పోకూడదనే లక్ష్యంతో ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ సోమవారం పుంగనూరులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు, సీపీఐ పుంగనూరు పట్టణ సహాయ కార్యదర్శి కామ్రేడ్ మున్నా తెలిపారు. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక శుభారాం డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు ఈ శిబిరం ప్రారంభం కానుందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రక్తదానం అనేది కేవలం సామాజిక సేవ మాత్రమే కాదని, ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలను కాపాడే మహోన్నత కార్యక్రమమని అన్నారు. మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం మరొకరి జీవితంలో వెలుగులు నింపుతుందని, రక్తానికి ప్రత్యామ్నాయం లేనందున స్వచ్ఛంద రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో ఎంసీవీ, ఎస్వీ, శుభారాం డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులతో పాటు పట్టణ, పరిసర ప్రాంతాల యువత, స్వచ్ఛంద రక్తదాతలు పాల్గొనాలని కోరారు. సమాజం పట్ల బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, ఏఐఎస్ఎఫ్ నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్నా విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్‌కు ఘన సన్మానం



యలమంజుల బాలాజీని సత్కరించిన పుంగనూరు న్యాయవాదుల ప్రతినిధులు
పుంగనూరు అడ్వకేట్స్ అసోసియేషన్ తరపున అభినందనలు

పుంగనూరు, జ్ఞానజ్యోతి: రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ యలమంజుల బాలాజీని పుంగనూరు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మదనపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సన్మాన కార్యక్రమంలో పుంగనూరు న్యాయవాదులు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుంగనూరు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. విజయ్ కుమార్, బాలాజీ కుమార్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) సురేష్ బాబు రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ యలమంజుల బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. పుంగనూరు న్యాయవాదుల సంఘం తరపున శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం ప్రతినిధులు పరస్పర మర్యాదలు, న్యాయవాదుల సంఘాల మధ్య సమన్వయం, న్యాయవాదుల వృత్తిపరమైన అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

‘శ్రేష్ఠ’ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఎస్సీ, డీఎన్‌టీ విద్యార్థులకు ప్రముఖ ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య
నవంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలి
దరఖాస్తు, పరీక్ష రుసుము పూర్తిగా ఉచితం

మదనపల్లె, జ్ఞానజ్యోతి: ప్రతిభావంతులైన షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), డీనోటిఫైడ్ తెగల (డీఎన్‌టీ) విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ‘శ్రేష్ఠ’ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి సి. దామోదర్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 2,400 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. వీరిలో 2,160 మంది ఎస్సీ, 240 మంది డీఎన్‌టీ విద్యార్థులు ఉంటారని తెలిపారు. ఎంపికైన వారికి ప్రముఖ ప్రైవేటు పాఠశాలల్లో 9, 11వ తరగతుల్లో ప్రవేశాలు కల్పించి, విద్యకు అయ్యే పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు రుసుము, పరీక్ష రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఓఎంఆర్ (పెన్ అండ్ పేపర్) విధానంలో హిందీ, ఆంగ్ల భాషల్లో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అర్హతలు, పరీక్ష సిలబస్, ఇతర నిబంధనలను అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి నవంబర్ 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ నవంబర్ 14 నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతుంది. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు డిసెంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు అవకాశం కల్పించారు. పరీక్షా కేంద్రం నగర వివరాలను డిసెంబర్ 20న ప్రకటించనుండగా, హాల్‌టికెట్లు 2027 జనవరి 3 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్ష జనవరి 10న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. వివరాలకు సంప్రదించాల్సిన సంప్రదించాల్సిన హెల్ప్‌డెస్క్ నంబర్లు: 01140759000, 69227700


బార్ కౌన్సిల్ చైర్మన్ బాలాజీకి చినబాబు అభినందనలు



మదనపల్లె, జ్ఞానజ్యోతి: బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన యలమంజుల బాలాజీని రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు, మదనపల్లె మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ చినబాబు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా బాలాజీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో బార్ కౌన్సిల్ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డిసిప్లినరీ కమిటీ కోఆప్టెడ్ మెంబర్ పి. వెంకట నరసింహులు, న్యాయవాది డి.వి. రమణలను కూడా చినబాబు ఆత్మీయంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం, న్యాయవ్యవస్థలో వారి పాత్ర తదితర అంశాలపై వారితో మాట్లాడారు.

ఎంపీపీ దొరస్వామి నాయుడుకు చినబాబు అభినందనలు

ములకలచెరువు, జ్ఞానజ్యోతి: ములకలచెరువు మండల ఎంపీపీగా విజయం సాధించిన కట్టా దొరస్వామి నాయుడును మదనపల్లె మున్సిపల్ చైర్మన్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీరామ్ చినబాబు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. దొరస్వామి నాయుడు స్వగృహానికి వెళ్లిన చినబాబు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎంపీపీగా సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. మండల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో గుత్తికొండ త్యాగరాజు, కంచర్ల చింటూ, కంచర్ల శ్రీనివాసులు, సురేష్, కేవీ రమణ, సయ్యద్ బాషా, కలేసా, జహీర్, గంగా దేవి, నాగమల్లప్ప, వెంకటస్వామి, సుధాకర్, మహేష్, రవి నాయుడు తదితరులు పాల్గొని దొరస్వామి నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు.



పంచాయతీ పోలింగ్ వేళ స్థానిక సెలవు

మూడు విడతల ఎన్నికల తేదీల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు
పోలింగ్‌కు 44 గంటల ముందే మద్యం దుకాణాల మూసివేత
ప్రైవేటు సంస్థల ఉద్యోగులకూ పెయిడ్ హాలిడే



మదనపల్లె, జ్ఞానజ్యోతి: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో పోలింగ్ జరిగే ప్రాంతాల్లో స్థానిక సెలవులు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు పోలింగ్ తేదీల్లో సెలవు వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబరు 26, 29, డిసెంబరు 2 తేదీల్లో మూడు విడతలుగా పోలింగ్ జరగనుంది. పోలింగ్, ఓట్ల లెక్కింపు నిర్వహణకు వినియోగించే ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు, ఇతర భవనాలకు పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజున స్థానిక సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల విధులకు అవసరమైన భవనాలను సంబంధిత అధికారులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని ప్రైవేటు, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు తమ ఉద్యోగులకు ఆయా పోలింగ్ తేదీల్లో పెయిడ్ హాలిడే కల్పించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. సెలవు ఇవ్వడం సాధ్యం కాని పరిస్థితుల్లో కనీసం మూడు గంటలపాటు విధుల నుంచి మినహాయింపు కల్పించాలని స్పష్టం చేశారు.

44 గంటల ముందే మద్యం దుకాణాల బంద్...

ఎన్నికలు జరిగే పోలింగ్ ప్రాంతాల్లో పోలింగ్ ముగిసే సమయానికి 44 గంటల ముందుగా మద్యం దుకాణాలను మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాటిని తిరిగి తెరవకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ ముగింపు సమయాన్ని అనుసరించి మద్యం దుకాణాల మూసివేతకు సంబంధించిన ఖచ్చితమైన సమయాలను ఎక్సైజ్, పోలీసు శాఖలు ప్రకటించి ఉత్తర్వులు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక నిఘా!

జూనియర్ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి
హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు కల్పించాలి
విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ
అధికారులకు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశం



మదనపల్లె, జ్ఞానజ్యోతి: విద్యార్థుల హాజరు శాతం పెంపు, విద్యా ప్రమాణాల మెరుగుదల, సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించాలని సూచించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో విద్య, సంక్షేమ, నైపుణ్యాభివృద్ధి తదితర శాఖల అధికారులతో మానవ వనరుల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హాజరులో అన్నమయ్య జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండటం అభినందనీయమన్నారు. విద్యార్థుల హాజరులో జిల్లా 11వ స్థానంలో ఉన్నందున మరింత మెరుగైన స్థానం సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల గైర్హాజరుకు కారణాలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.

ప్రజలతో మమేకం.. సేవా కార్యక్రమాల్లో చినబాబు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఘన స్వాగతం

నూతన జడ్పీ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్‌లకు అభినందనలు

'టీ వనం'లో స్థానికులతో ఆత్మీయ ముచ్చట్లు

అగ్నిప్రమాదంలో మృతి చెందిన మున్సిపల్ కార్మికురాలికి నివాళులు





మదనపల్లె, జ్ఞానజ్యోతి: రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు, మదనపల్లె మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి శ్రీరామ్ చినబాబు శుక్రవారం పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలపడంతో పాటు ఆసుపత్రి ప్రారంభోత్సవం, ఆధ్యాత్మిక కార్యక్రమం, వివాహ వేడుకకు హాజరయ్యారు. మరోవైపు స్థానికులతో మమేకమై వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అగ్నిప్రమాదంలో మృతి చెందిన మున్సిపల్ కార్మికురాలి కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మంత్రికి స్వాగతం..

జడ్పీ ప్రతినిధులకు అభినందనలు

మదనపల్లె పర్యటనకు వచ్చిన రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి చికిలబైలు వద్ద చినబాబు, దివ్యశ్రీ సిల్క్స్ ఎండీ యోగేశ్వర్‌బాబు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం మంత్రితో కలిసి అన్నమయ్య జిల్లా నూతన జడ్పీ చైర్మన్ సుగవాసి ప్రసాద్‌బాబు, వైస్ చైర్‌పర్సన్ తలారి శరణ్య, చిన్నమండెం జడ్పీటీసీ లక్ష్మీప్రసాద్‌రెడ్డిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన నాదెళ్ల రిషిత, తేజల వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుక అనంతరం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చినబాబు నివాసానికి వెళ్లగా కుటుంబ సభ్యులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. మధ్యాహ్నం జడ్పీ వైస్ చైర్‌పర్సన్ తలారి శరణ్య, తలారి మంజునాథ్ చినబాబు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆసుపత్రి ప్రారంభం.. స్థానికులతో ముచ్చట్లు..

ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్రముఖ హృద్రోగ వైద్య నిపుణుడు డాక్టర్ చంద్రశేఖర్ ఏర్పాటు చేసిన 'శ్రీ రామస్వామి హృదయాలయ' ఆసుపత్రిని చినబాబు ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. సుజాత ట్రేడర్స్ అధినేత మడక సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా మహోత్సవ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలోని శేఖర్ స్వీట్స్‌ను సందర్శించగా నిర్వాహకులు దినకర్ ఆయనను సన్మానించారు. నీరుగట్టువారిపల్లిలోని 'టీ వనం'ను సందర్శించి అధినేత బి. మహేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ స్థానికులతో కలిసి టీ తాగుతూ ఆప్యాయంగా ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ పబ్లిక్ హెల్త్ విభాగంలో ఫీల్డ్ వర్కర్‌గా పనిచేస్తున్న కె.జి. రాధమ్మ అగ్నిప్రమాదంలో మృతి చెందడం పట్ల చినబాబు విచారం వ్యక్తం చేశారు. వికలాంగుల కాలనీలోని ఆమె నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో రామ్మూర్తి నాయుడు, ప్రభాకర్, రంగస్వామి నాయుడు, టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, నాదెళ్ల శివ, నాగూర్ వలి, పచ్చిపాల రామకృష్ణ, దొరస్వామి నాయుడు, భాస్కర్, ప్రభు గౌడ్, పట్టణ అధ్యక్షుడు అరుణ్ తేజ్, సీటీఎం శ్రీనివాసులు, రవి నాయక్, శ్రీకాంత్, కేఎన్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయానికి పంచలోహ ఉత్సవ విగ్రహాల వితరణ

సొంత నిధులతో విగ్రహాలు సమర్పించిన దాత స్టోర్ మోహన కుటుంబ సభ్యులు





మదనపల్లె, జ్ఞానజ్యోతి: మండలంలోని బసినికొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి దాత స్టోర్ మోహన కుటుంబ సభ్యులు రూ.లక్ష విలువైన పంచలోహ ఉత్సవ విగ్రహాలను వితరణగా అందజేశారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా దాత స్టోర్ మోహన మాట్లాడుతూ..ఆలయ నిర్మాణం ప్రారంభించి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాల అవసరాన్ని గుర్తించి, తమ కుటుంబ సభ్యులతో కలిసి సొంత నిధులతో రూ.లక్ష వెచ్చించి పంచలోహ విగ్రహాలను తయారు చేయించి ఆలయానికి సమర్పించినట్లు వివరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దాత స్టోర్ మోహన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదాంత, ఆలయ కమిటీ సభ్యులు, స్టోర్ మోహన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





గృహప్రవేశ వేడుకలో నిసార్ అహ్మద్

మదనపల్లె, జ్ఞానజ్యోతి: రామసముద్రం మండలం బిక్కంవారిపల్లిలో శుక్రవారం నిర్వహించిన నూతన గృహప్రవేశ వేడుకలో మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ పాల్గొన్నారు. మండల యువజన విభాగం అధ్యక్షుడు బాలాజీ ఆహ్వానం మేరకు ఆయన నూతన గృహానికి విచ్చేసి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా బాలాజీ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కొండూరు కృష్ణారెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

44 ఏళ్ల పార్టీ సేవకు గుర్తింపు కోరుతున్నా

వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించండి!

34వ వార్డు కౌన్సిలర్ బోయపాటి రంగస్వామి నాయుడు విజ్ఞప్తి

48 వార్డుల్లో అత్యధికంగా 727 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం

పదవుల కోసం కాదు.. పార్టీ బలోపేతమే లక్ష్యమంటూ ప్రకటన

కౌన్సిలర్‌గా బాధ్యతలు చేపట్టకముందే వార్డులో ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రీకారం



మదనపల్లె, జ్ఞానజ్యోతి: నాలుగు దశాబ్దాలకు పైగా తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో సేవలందించిన తనకు మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కేటాయించి సముచిత గుర్తింపు ఇవ్వాలని 34వ వార్డు కౌన్సిలర్ బోయపాటి రంగస్వామి నాయుడు పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న సీనియర్ నాయకులకు పదవుల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత 44 సంవత్సరాలుగా ఎలాంటి స్వార్థం, పదవీ కాంక్ష లేకుండా తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నట్లు రంగస్వామి నాయుడు పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సైతం వెన్నంటి నిలిచి, కార్యకర్తగా, నాయకుడిగా తన వంతు బాధ్యతలు నిర్వర్తించానన్నారు. పదవుల కంటే పార్టీ బలోపేతమే తనకు ముఖ్యమని, అయితే సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తున్న సీనియర్ల అనుభవాన్ని గుర్తించి తగిన అవకాశాలు కల్పించడం ద్వారా మరింత మంది నాయకులకు ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. 44 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానానికి గుర్తింపుగా మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని కేటాయించాలని కోరారు. ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన మదనపల్లె మున్సిపల్ ఎన్నికల్లో 34వ వార్డు నుంచి పోటీ చేసిన బోయపాటి రంగస్వామి నాయుడు 1,090 ఓట్లు సాధించి, ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపై 727 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. మున్సిపాలిటీలోని మొత్తం 48 వార్డుల్లో అత్యధిక మెజారిటీ సాధించిన కౌన్సిలర్‌గా ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ విజయం ఆయనకు వార్డులో ఉన్న ప్రజా దరణకు నిదర్శనంగా నిలిచింది. ఎన్నికల్లో విజయం సాధించడంతోనే తన బాధ్యత పూర్తయిందని భావించకుండా, కౌన్సిలర్‌గా అధికారికంగా ప్రమాణస్వీకారం చేయకముందే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. సొంత నిధులతో వార్డులోని నీటి శుద్ధి కేంద్రాల మరమ్మతులు, మురుగు కాలువల శుభ్రత, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. వార్డులో పర్యటిస్తూ స్థానికుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి ముందడుగు వేస్తున్నారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతలు చేపట్టకముందే ప్రజా సమస్యలపై స్పందిస్తూ పనులు ప్రారంభించడం స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ నేపథ్యంలో పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందించిన తనకు వైస్ చైర్మన్ పదవి కల్పించడంతో పాటు, ప్రజాసేవకు మరింత విస్తృతమైన అవకాశం ఇవ్వాలని బోయపాటి రంగస్వామి నాయుడు కోరుతున్నారు. సీనియర్ల సేవలకు గుర్తింపు, ఎన్నికల్లో ప్రజల నుంచి లభించిన ఆదరణ, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపుతున్న చొరవను పరిగణనలోకి తీసుకుని పార్టీ అధిష్ఠానం సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

పంచాయతీ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు

మూడో విడతలో 9 మండలాల్లో 156 పంచాయతీలకు నామినేషన్లు

ఈ నెల 21 నుంచి 23 వరకు 43 కేంద్రాల్లో స్వీకరణ

నామినేషన్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల వరకు ఆంక్షలు

సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా: ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



మదనపల్లె, జ్ఞానజ్యోతి: మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలోని తొమ్మిది మండలాల్లో 156 గ్రామ పంచాయతీలకు సంబంధించి 43 కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ వెల్లడించారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి నామినేషన్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలోకి అనధికార వ్యక్తులు, వాహనాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థుల తరఫున ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడాన్ని పూర్తిగా నిషేధించినట్లు పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు ప్రతిపాదకుడిని మాత్రమే క్యూలైన్ ద్వారా కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచనున్నట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు అవసరమైన పోలీసు బందోబస్తు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 30 పోలీసు యాక్ట్, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి కోరారు.